# గుప్పిట్లో స్వాతంత్ర్యం

సుచరిత

ఈసురోమంటూ కొంప చేరేసరికి గుమ్మానికి పెట్టివున్న తాళం సత్యాన్ని వెక్కిరించింది. ఆశ్చర్యపోయాడు సత్యం. శారద ఎక్కడికి వెళ్ళి వుంటుంది? ఈ రెండు సంవత్సరాల్లో ఇలా జరగటం ఇదే మొదటిసారి.

వీధిలో ఎలా నిలబడటం? అందుకే కాస్త అలా పార్కుకి వెళ్ళి వద్దామని వెనక్కి తిరగబోతుంటే శారద ఎదురుగా పరుగులాంటి నడకతో వస్తూ కన్పడింది.

"చాలా సేపయిందా వచ్చి?" అంటూనే గబగబా తాళం తీసింది శారద.

సత్యం సమాధానం యివ్వకుండా, "ఎక్కడికి వెళ్ళావు?" అడిగాడు లుంగీ చుట్టుకుంటూ.

ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో వొంచి యిచ్చింది శారద. ఒక్కక్షణం వూరుకుని, "నాకు వుద్యోగం దొరికింది!" అంది.

సత్యం తెల్లబోయాడు, "నీకా? ఉద్యోగమా? ఎక్కడా?" అంటూ.

"అంత ఆశ్చర్యపడవలసింది ఏముంది అందులో? మన పక్క వీధిలో కాన్వెంట్‌లోనే! టెంపరరీనే అనుకోండి."

"నీకు ఉద్యోగం దేనికి?"

"మీరు ఆఫీసుకి వెళ్ళిపోతే ఒక్కదాన్నే ఏమీ తోచటం లేదు. ఆ హెడ్‌మిస్ట్రెస్ నాకు తెలుసు. అందుకే, ఉద్యోగం చెయ్యాలని నిశ్చయించుకున్నాను," నిశ్చలంగా అంది శారద.

"నువ్వు వుద్యోగం చెయ్యటం నాకు యిష్టం లేదు." సత్యం నుదురు చిట్లించాడు.

శారద సూటిగా చూసింది అతన్ని. "క్షమించండి. ఇంతవరకు మీ మాటకు వ్యతిరేకంగా ప్రవర్తించలేదు. ఈ ఒక్కసారీ నా మాట మీరు మన్నించాలి."

శారద గొంతు దృఢంగా పలికింది. సత్యం ఆశ్చర్యంగా చూశాడు. రాత్రి పడుకోబోతూ వుంటే, సత్యం ఆడవాళ్ళు వుద్యోగం చేస్తే అందులో కష్టనిష్ఠూరాలు వివరించబోతూంటే, శారద, "ప్లీజ్! మీరు అభ్యంతర పెట్టకండి. నేను వుద్యోగంచేసి తీరాలి," అంది.

సత్యం యింక మాట్లాడలేదు.

*　　*

ఉద్యోగం కోసం అంతగా శారద పట్టుపట్టడానికి అసలు కారణాలు వేరే వున్నాయి.

ఓసారి, వూరగాయల రోజుల్లో పచ్చళ్ళ కోసం జాడీలు కొనాలంది శారద. పేపర్ చదువుతున్న సత్యం చిరాగ్గా చూశాడు. "ఎప్పుడూ ఏదో ఒకటి కొనాలంటూనే వుంటావేం?"

"బాగుంది. మరి సంసారం అన్నాక ఒక్కొక్కటీ సమకూర్చుకోవద్దూ!"

"అసలు నన్నడుగుతే అత్తారింటికి ఆడపిల్లని పంపేటప్పుడే కన్నవాళ్ళు అప్పడాల దగ్గర్నుంచి అద్దాల బీర్వా వరకూ, చింతకాయ జాడీ దగ్గర్నుంచి చిన్నసైజు సోఫా సెట్ వరకూ యిచ్చి పంపాలి," అన్నాడు సత్యం హాస్యంగానూ, సీరియస్‌గానూ.

శారద మనసు చివుక్కుమనింది.

"పెళ్ళికొడుకులు కట్నాలు తీసుకోడం మానేస్తే, తల్లిదండ్రులు అలాగే యిస్తారు అన్నీ," అంది రోషంగా.

ప్రతి పైసా కావాలన్నా శారదకి చిక్కే.

కొత్తల్లో కొన్ని నెలల వరకు శారదకి అతని జీతం ఎంతో తెలిసేది కాదు, తెలియవలసిన అవసరం లేదు. ఎందుకంటే పాలవాళ్ళకు చిల్లర కొట్లవాళ్లకు అతను ఫస్టు కంతా యిచ్చేస్తాడు.

"ఇంక మిగిల్న డబ్బు పర్సులో పెట్టుకుని టెర్లిన్‌షర్టు జేబులో వుంచుకుంటాడు ప్రతి నిముషం. అందుకని తెలిసే అవకాశమూ లేదు.

అప్పటికీ ఆత్రం దాచుకోలేక ఒకసారి బైట పడింది శారద, "మీకు జీతం ఎంత?" అని.

అదోలా చూసి సత్యం, "అప్పుడే ఆరాలు మొదలా?" అన్నాడు. భర్త జీతం ఎంతో తెలుసుకోవడం ఆరాలు తీయడమూ, అనవసర కుతూహలమూ అవుతుందా? తన పుట్టింట్లో యీ పద్ధతి ఏనాడూ ఎరుగదు శారద. ఆ వచ్చే దేదో తల్లీ, తండ్రీ సమంగా వాడేస్తారు. ఎవరు ఖర్చుపెట్టినా, ఏమి చేసినా అది కుటుంబం కోసమేగదు! కానీ సత్యం అలా అనుకోడు. తనేదో మింగుతున్నట్టు—దాచుకుంటున్నట్టు అనుమానపడతాడు.

డబ్బు విషయంలో సత్యం దేవుణ్ణి కూడా నమ్మడు అన్న విషయం గ్రహించడానికి శారదకి ఎన్నో రోజులు పట్టలేదు.

ఆ మాట పైకి అంటే సత్యం నవ్వి, 'పొదుపు చెయ్యాలి' అంటాడు. అరికాలి మంట నెత్తికెక్కుతుంది శారదకు.

పొదుపు చెయ్యాలి!

భార్య చీరల దగ్గరా! భార్య పువ్వుల దగ్గరా! అంతవరకే పొదుపు! అతని సంబంధించిన విషయాలు ఒక్కటి మార్చుకోడు. అసలు మారకూడదు. వీధిలోకి వెళ్తే అతను జీతంలో సగం డబ్బులు హోటల్‌కే ఖర్చుపెట్టవచ్చు. స్నేహితులతో ఖుషీ చేయవచ్చు. అటువంటి ఆనంద కరమయిన




సమయాల్లో కనీసం భార్య అయినా గుర్తు రాదు. పొదుపు అంతకన్నా గుర్తురాదు.

ఎప్పుడయినా అణిచి పెట్టినా అణగని ఆడమనసు పువ్వులు కొనుక్కోవాలని

ముచ్చటపడితే చేతిలో డబ్బులు వుండవు. సత్యం యింట్లో లేకపోతే వచ్చేవరకు ఆగాలి. లేకపోతే ఆ కోరిక చంపుకోవాలి. స్వంత సంపాదన అంటూ లేకపోతే మరి అంతేగద!

అప్పటికే అభిమానం చంపుకుని శారద చాలాసార్లు, 'నా ఖర్చుకంటూ కొంత యివ్వండి. ఏటికీ మాటికీ అడగాలంటే ప్రాణం చచ్చిపోతోంది," అంటే, సత్యం తేలిగ్గా, "నీకు అంతఖర్చు లేముంటాయి, శారదా!" అంటాడు.

ఖర్చులేమీ వుండవుగదూ! ఖర్చుపెడి తేనే చేతులో డబ్బు వుండాలా? ఏ అత్యవసరమయిన పరిస్థితో వస్తుంది. లేదా, అతను కాంపుల కెళ్ళినప్పుడు తనకు జ్వరమే వస్తుంది. ఇంకేదయినా అవు తుంది. అటువంటప్పుడు ఐదుపైసలు పెట్టి సోడా తాగాలన్నా, పన్నెండు పైసల్తో సారి డాన్ కొనుక్కోవాలన్నా కూడా లేకపోతే ఎలాగ?

చిన్నతనంలో ఓసారి తను అత్తయ్యా వాళ్ల యింటికి వెళ్ళింది శెలవులకు. వాళ్లది చాలా ఘరానా కుటుంబం. ఎంత సంపా దిస్తారో ఎంత ఖర్చవుతుందో వాళ్ళకే తెలీదు. అంత దర్జాగా వుంటారు. మామయ్య ఏదో పనిమీద పొరుగూరు వెళ్ళాడు. అత్తకూతురు సుజాతకి హఠా త్తుగా జ్వరం ముంచుకొచ్చింది.

వాళ్ళ వూరి ఆచార్లుగారు ఏవో నాటు వైద్యాలు చేసి బత్తాయి రసం తాగించమనీ, అన్నం వొద్దనీ చెప్పాడు.

అత్తయ్యా దగ్గర డబ్బులు లేవు బత్తా యిలకు. ఇల్లంతా తిరిగింది. పెట్టెలన్నీ బోర్లించింది. గూళ్ళన్నీ గాలించింది. పైసా దొరకలేదు. అత్తయ్య ఆ క్షణంలో పడిన ఆవేదన తనకీనాటికీ తలుచుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. ఒక పక్క 'ఆకలో' అంటూ గోలపెట్టే రోగి, ఇంకో పక్క చేతిలో పైసా లేని నిస్సహాయ స్థితి! అత్తయ్య తర్వాత ఓ మానెడు బియ్యం పసిపిల్ల చేత అమ్మించి, బత్తాయిలు తెప్పించింది. అది వేరే సంగతి! అత్తయ్య తరానికి తన తరానికి మధ్య ఎంతోదూరం వుంది. ఆ నాటికీ యీ నాటికీ కాలం ఎంతో మారింది.... ...కానీ సంపాదించే భర్త వుండీ అవసరానికి చేతిలో పైసాలేని అత్తకీ, తనకీ ఏమిటి తేడా? ఏమీలేదు.

డబ్బు గురించిన చర్చలూ, ఖర్చులూ భార్యతో చెప్పాలంటే సత్యం ఎందుకు నామర్దా ఫీలవ్వాలో శారద కర్థంకాదు.డబ్బు విషయంలో భార్య దగ్గరా దాపరికం అయితే యింక సంసారం ఎలాగ సాగుతుంది! స్త్రీ ఒక్కతే పొదుపుచేస్తే చాలుతుందా?

ఇరవై సంవత్సరాలు పెరిగిన వాతావర ణాన్నీ, కన్నవాళ్ళనీ, ఆప్తుల్నీ, అంతనీ వొదిలేసి, ముక్కూమొహం ఎరగని మొగాడిచేత మూడు ముళ్ళూవేయించుకుని, 'నువ్వేదిక్కు', అంటూ అమ్మాయి వేయి కలలతో వచ్చేసి....ఎంతవరకు తృప్తిపడ గలుగుతూంది? ఏటికీ మాటికీ అసంతృప్తి,

అశాంతి రేగుతుంటే, యింటిని స్వర్గంగా మార్చటం ఏ అమ్మాయి తరం అవుతుంది!

ఎంత మోటు మనిషికయినా చీటికీ మాటికీ మాటల బల్లేలు దిగుతూవుంటే హృదయం ఎన్నాళ్లు బండ బారిపోకుండా వుంటుంది? సరిగా నెలక్రితం.... మొదటి సారిగా తన యింటికి తమ్ముడు వచ్చాడు. వాడు వున్నది వారం రోజులు. అయితే ఏం, సత్యం ఆ వారమూ బతికినన్నాళ్ళూ గుర్తు వుండేలా చేశాడు, చాలు!

కాఫీ పొడుం అయిపోయింది తెమ్మని తను చెబుతూంటే, సత్యం 'మొన్ననే కదూ పౌన్ తెచ్చాను?' అన్నాడు విసుగ్గా.

"మొన్న ఎక్కడ! వారం పైన అయింది."

"పౌను కాఫీ పొడి వారం రోజులా? ఇలా అయితే నా జీతం అంతా యీ కాఫీ లకే అవుతుంది, తెలుసా?" తీక్షణంగా అన్నాడు సత్యం.

అతను పౌను కాఫీపొడి తెచ్చిన సంగతే గుర్తు పెట్టుకున్నాడుగానీ, ఆఫీసు కెళ్ళే లోపల తను ఎన్నిసార్లు కాఫీ తాగుతున్నా నన్నది గుర్తు పెట్టుకోలేదు. ఏం చిత్రం!

శారద ఆ మాట పైకి అనలేదు. పక్క గదిలో తమ్ముడు వున్నాడు. వింటే బాధ పడతాడు. మళ్ళీ——

"ధర్మసత్రంలా తయారయింది కొంప; ఛీ, ఛీ, ఎప్పుడూ చుట్టాలే!"

సత్యం సణుగుతుంటే కత్తుల చక్రంతో మనసు పిండి నట్టయింది తనకి.

ఏదయినా అంతే. వెచ్చాలు అయిపోయా యని చెప్పాలంటే భయం! డబ్బు సంపా దించేది ఎందుకు? వేడుక్కా? ఇనప్పెట్టెలో దాచుకుని చూసుకుని మురిసిపోవడానికా? అలాంటి మన స్తత్వం కలవాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకోటం ఎందుకు? పెళ్ళితోపాటు బాధ్య తలూ, సంసారమూ నెత్తిన పడతాయన్న గ్రహింపు వుండదా?

రాకరాక వచ్చిన తమ్ముడు వెళ్లేనాడు వాడి చేతిలో పెట్టటానికి తన దగ్గర ఒక్క పది రూపాయలు లేవు. ఎంత దౌర్భాగ్యం!

* * *

ఈ ప్రపంచంలో ప్రతి మనిషికీ తన దంటూ స్వంత డబ్బు వుండాలి. డబ్బు లేనివాడు ఎందుకూ పనికిరాడు. విలువ లేదు. వ్యక్తిత్వం లేదు. డబ్బు విషయంలో యింకోడి మీద ఆధారపడి, వాడి మోచేతి నీళ్లు తాగుతూ, అనుక్షణమూ విదిలింపులు-విసుర్లు తింటూ జీవితం గడిపే మనిషి వీధిలో ఎంగిలి విస్తరాకు నాకే కుక్క కన్నా హీనం! ఏదయినా పండగ కోసం కొత్త చీర కావాలని మోజుపడితే, సత్యం వెట కారం అంతా గొంతులో నింపి, 'మీ నాన్న యిచ్చిన మూటలు ఏమీలేవు నాకు, నీకు ప్రతి పండక్కీ చీరలు తీసుకురావడా నికి!' అంటాడు హేళనగా.

పెంచి పెద్దచేసి పెళ్ళి చేసేదికాక యింక వేరే మూటలుకూడా కట్టి యివ్వాలా?

"ఈ ప్రపంచంలో ఆడదానిగా పుట్టటం కంటే దౌర్భాగ్యం యింకోటి లేదు" అని

అనుకోవలసిన పరిస్థితి మొగాడు తెప్పిస్తే ........?

చాలా కుటుంబాల్లో ఆడిపిల్ల యింకా గుండెలమీది కుంపటే. ఎంత త్వరగా పెళ్ళి చేసి తమ బాధ్యత తీర్చుకుందామా అని ఆత్రపడే తల్లిదండ్రులు హెచ్చుభాగం. పెళ్లయ్యాకమాటా, చూపులు కలిసిన మొదటి క్షణంనుంచే, 'హాయిగద: ముద మాయెగద!' అని డ్యూయెట్స్ పాడు కోడానికి యిది సినిమా కాదు. నెలలు కాదు. సంవత్సరాలు తిరిగినా ఎక్కడో ఒకళ్ళు తప్ప సాధారణంగా అంతా భార్యని పరాయి గానే భావిస్తారు.

శారదకు పెళ్ళి కాకముందు తన భావి జీవితాన్ని గురించిన ఎన్నోకలలు వుండేవి. అను క్షణమూ కీచులాడుకునే వాళ్ళనిచూస్తే ఆశ్చర్యం వేసేది. జీవితం అంతా కలిసి ప్రయాణం చేయవలసినవాళ్ళు ఎందుకలా వీధినపడి దెబ్బలాడు కుంటారో అర్థం అయ్యేది కాదు.

డజను మంది పిల్లలు పుట్టినా, పదేళ్ళు ఒక యింట్లో మసలుతూ గడిపినా, భర్త అటు తిరగ్గానే మూతులు విరిచే భార్యలూ, రాత్రిపూట తప్ప భార్య గుర్తురాని భర్తలూ, చాలా మందిని చూసింది.

కానీ తన బంగారు కలలన్నీ క్రమేపీ కరిగిపోతూ వచ్చాయి. స్త్రీ పురుషుల మధ్య శారీరక సంబంధం కాక మరో సున్నిత మయిన అనుబంధం వుంటుందనీ, స్నేహా నుభూతి కూడా కావాలనీ సత్యానికి తట్టలేదు.

అతను సంపాదించి తెస్తాడు. వండి పెట్టటం వరకే తన వొంతు. ఇదీ అతని అభిప్రాయం. కానీ, చిక్కేమిటంటే, అంత టితో తృప్తిపడి జీవితమంతా పొగగూటి తోనూ, పోపుల డబ్బాలతోనూ నెట్టేసే 'అత్తయ్య' లాంటి ఆడదికాదు తను.

భర్త తననొక హృదయంవున్న మని షిగా, ఓ స్నేహితురాలిగా, అన్ని విష యాల్లో తనని తోడుగా తీసుకుంటే, అంత కంటె కావలసింది ఏముంది? అతను తనకి సమానత్వం యిస్తే తనంతట తాను అత నికి మనఃపూర్తిగా సేవచెయ్యదూ? అతని కోసం ప్రాణం యివ్వదూ? మనసు విప్పి వెల్లడిస్తే....

"కథల్లోలా మాట్లాడక!" అంటాడు సత్యం.

కథలు వచ్చేది సంసారాల్లోంచి, సమా జాల్లోంచే కాదూ? చాలా మంది అది ఆలో చించరేం? ఒక మనిషి ఒక కథ రాసేడంటే అది అతని గుండెల్లోంచి వస్తుంది. అతని వేడి వూపిరిలోంచి వస్తుంది. అతని చుట్టు పక్కల వాతావరణంలోంచి వస్తుంది.

శారద చాలా ఆలోచించింది. చాలా సర్ది చెప్పుకుంది చాలా రోజులు!

తన జీవితమూ, అత్తయ్య జీవితంలా కావటానికి వీల్లేదు.

అత్తకి ఆలోచించే శక్తీ తను నమ్మిన ధర్మాన్ని మీరే ధైర్యమూలేవు. కానీ తనకు చదువు యిచ్చిన వివేకం, ఆత్మధైర్యమూ వున్నాయి.



ఈ రోజు సరే కానీ యింకా కొన్నాళ్ళకి సంసారం పెరుగుతుంది.

తన బిడ్డలకోసం, తను డబ్బు సంపాదించాలి. తన కూతురు తనలా అశాంతితో నలగ కూడదు. శారద ఆ మర్నాటినుంచీ కన్పించిన ప్రతి పేపరూ చూడసాగింది.

ఒకరోజు మధ్యాన్నం ఏమీ తోచక గుమ్మంలో నిలబడితే తను చదువుకునే రోజుల్లో హెడ్‌మిస్ట్రెస్ కన్పించింది. శారద గుర్తుపట్టింది. అంతలో ఆవిడే చిరునవ్వు నవ్వింది, "నువ్వు శారదవి కదూ?" అంటూ.

శారద లోపలికి ఆహ్వానించింది. "గుర్తున్నానా, మేడమ్?" అంటూ.

"ఎందుకు గుర్తువుండవు, శారదా! నువ్వు వెళ్ళిపోయాక స్కూల్లో గొంతెత్తి కమ్మగా పాడేవాళ్ళే లేకపోయారు. ఇప్పుడు నేను చిన్న పిల్లల కాన్వెంట్‌లో పని చేస్తున్నానమ్మాయ్!" అంది ఆవిడ శారద యిచ్చిన కాఫీ అందుకొంటూ.

మెరుపులాంటి ఆలోచన వచ్చింది శారదకి.

"మీ స్కూల్లో ఏమయినా ఖాళీ వున్నాయా, మేడమ్?" అడిగింది.

"టెంపరరీగా అయితే ఒకటి వుంది. ఎవరికి యింతకీ?"

"నాకేనండి." సిగ్గుపడింది శారద.

"నీకయితే యింక అభ్యంతరం ఏముందీ? ఇంక వేరే ఎవర్నీ చూసుకో వలసిన పని కూడాలేదు."

శారదకి ఆనందంలో కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "చాలా థాంక్స్ మేడమ్! వెయ్యి థ్యాంక్స్! రేపు ఫస్టునించి వస్తాను," అంది.

"అలాగేనమ్మా!" అంటూ లేచింది ఆవిడ.

అలా అనుకోకుండా వుద్యోగం దొరికింది శారదకి.

ఇంక "పూలు కొనుక్కోవాలి పావలా యివ్వరూ!" అనీ—

"కూరలు కొన్నాను. రూపాయి యివ్వండి." అనీ—

అడగనవసరం లేదు అతన్ని. అతని విదిలింపులు పడనవసరంలేదు. అడుగడుగునా ఆత్మాభిమానం చంపుకోవలసిన అవసరంలేదు.

శారద తృప్తిగా ప్రశాంతంగా నిద్రపోయింది ఆ రాత్రి సత్యం అయిష్టం లక్ష్య పెట్టకుండా.

